పాతబస్తీలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- పట్టించుకోని వన్‌టౌన్ ట్రాఫిక్ విభాగం
- ఎటు చూసిన బారులు తీరుతున్న వాహనాలు
- ప్రజలు అల్లాడుతున్న పట్టించుకోని పోలీసు అధికారులు



లోబ్రిడ్జి వద్ద అడ్డదిడ్డంగా ఆటోలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఎటు చూసినా బారులు తీరుతున్న వాహనాలతో ప్రజలు అల్లాడుతున్నా ట్రాఫిక్ విభాగ పోలీసులకు చీమ కుట్టినట్లుగా కూడా ఉండటం లేదు. పాతబస్తీలోని వన్‌టౌన్ ట్రాఫిక్ విభాగం విధులు నిర్వహించటంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజానీకం ఆరోపిస్తుంది. ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలెంత అల్లాడుతున్నా వారు మాత్రం వారి తంతులో నిమగ్నమై వన్‌టౌన్ వాసుల కష్టాలను పట్టించుకోవటం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపార వాణిజ్య కేంద్రమైన పాతబస్తీకి ఇతరులు రావాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పోలీసు శాఖ మత్తు నిద్రలో ఉంటుందని, అక్కడ ఎవరూ ట్రాఫిక్‌ను పట్టించుకోరంటూ ఇతర ప్రాంతాలవారు సైతం పోలీసు సిబ్బందిపై విమర్శలు గుప్పిస్తున్నారంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. జరిమానాలకు తప్పా ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు స్పందించరంటూ పలువురు మండిపడుతుండటం స్థానిక పరిస్థితులకు అద్దం పడుతుంది.

నిత్యం ట్రాఫిక్ సమస్యలు....

వ్యాపార కేంద్రమైన వన్‌టౌన్‌కు నిత్యం లక్షలాది మంది వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అదే క్రమంలో వాహనాల రాకపోకలు సైతం కొనసాగుతుంటాయి. అయితే పోలీసు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉండవని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా కాళేశ్వరరావు మార్కెట్ పరిసరాల్లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. గద్దె బొమ్మ సెంటర్‌లో ఇష్టారాజ్యంగా ఆటోవాలాలు తమ వాహనాలను నిలిపివేస్తుంటారు. మరోవైపు మంగళగిరి, భవానీపురం వైపు వెళ్లే వాహనాలు కెనాల్ పక్కన అడ్డదిడ్డంగా నిలిపివేస్తుంటారు. దాంతో లోబ్రిడ్జి నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వైపు వచ్చే వాహన చోదకులు నానా తంటాలు పడుతున్నారు. అలాగే మార్కెట్ బస్ టెర్మినల్ నుంచి కంట్రోల్ రూమ్ వైపు వెళ్లే వాహనాలకు లోబ్రిడ్జి మలుపు వద్ద నరకాన్ని తలపిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ ఉదయం సాయంత్రం సమయాల్లో ఆటోలు రోడ్డును అక్రమించి వరుసగా నిలిపివేస్తున్నారు. అక్కడ బస్సు మలుపు తిరగాలన్నా, ఇతర వాహనాలు ముందుకు సాగాలన్నా ఆటోలు అడ్డంకిగా మారుతున్నాయి. దానికి తోడు లోబ్రిడ్జి దిగువన మెట్ల వద్ద సైతం ఆటోలు నిలిపివేస్తున్నారు. ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్నా ఒక్క పోలీసు సిబ్బంది అక్కడ కనిపించరు.



బ్రాహ్మణవీధిలో బారులు తీరిన వాహనాలు

అంతర్గత రహదారుల్లో మరింత దయనీయం

పాతబస్తీలోని అంతర్గత రహదారుల్లో పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయని వన్‌టౌన్ వాసులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా బ్రాహ్మణవీధిలో నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి రథం సెంటర్ వరకూ వాహనాల రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మూడు నాలుగు నిమిషాల్లో ఆ వీధిని దాటే అవకాశముంటే వాహనాల ట్రాఫిక్ సమస్యలతో కనీసం అరగంటకు పైగా సమయం పడుతుంది. ఈ రహదారిలోనూ ఒక్క ట్రాఫిక్ విభాగ సిబ్బంది కనిపించారు. అలాగే భావనారాయణవీధి, మొయిన్‌బజార్, కాన్వెంట్ వీధి తదితర ప్రాంతాల్లోనూ అధ్వానంగా ట్రాఫిక్ వ్యవస్థ కనిపిస్తుంది. కానీ అక్కడ ఒక్క ట్రాఫిక్ సిబ్బంది కనపడటం లేదు.

మామూళ్ల మత్తులో స్టేషన్ సిబ్బంది

వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ వ్యవస్థ అంత దారుణంగా ఉంటే స్టేషన్ సిబ్బంది మామూళ్ల మత్తులో ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ సంఘాలు, వ్యాపారవేత్తల నుంచి నెలవారీ మామూళ్లను దండుకుంటున్నారని, ఉన్నతాధికారులకు పంపించాలంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు స్థానికులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ వ్యవస్థ దయనీయంగా ఉంటున్నా ఉన్నతాధికారులెవరూ జోక్యం చేసుకోకపోవటంపై ఆరోపణలకు బలం చేకూరుస్తుందని స్థానిక వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

ఆలయ ప్రాంగణంలో నిలిచేది ఎలా?



ఆలయ ప్రాంగణంలో ఎండలో భక్తుల ఇబ్బందులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో నిమిషం కూడా నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. ఫిబ్రవరిలోనే ఎండలు తీవ్రంగా ఉండటంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు పరుగులు పెడుతున్నారు. ముఖ్యంగా ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద బస్సు దిగిన తర్వాత చెప్పుల స్టాండ్ వరకు పరిస్థితి భాగానే ఉంటుందని, అక్కడి నుంచి క్యూలైన్‌లోకి చేరుకోవడం కష్టంగా ఉందంటున్నారు. క్యూలైన్‌లో వచ్చే వారి పరిస్థితి కొంత మేర ఇబ్బందులు లేకపోయినా వీఐపీ పేరిట వచ్చే వారు పరుగులు పెడుతున్నారు. లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఎండ తీవ్రతతో పిల్లలతో అల్లాడిపోతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి దర్శనం అయిన తర్వాత పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. కనీసం కాళ్లు కాలకుండా పట్టాలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కూల్ పెయింట్ వేసినా ఇబ్బందులు తప్పుతాయని భక్తులు పేర్కొంటున్నారు.

పాతశివాలయంలో అరుణ పారాయణాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో బుధవారం సూర్యనారాయణ స్వామి వారికి ప్రీతికరంగా పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అరుణ సూర్య నమస్కారాలు, పారాయణం నిర్వహించారు.



మంటల్లో కాలిపోయిన ఎగ్జిబిషన్



సంఘటనా స్థలంలో పడి ఉన్న ఫైర్ సేఫ్టీ సిలిండర్లు





సామగ్రిని వెలికితీస్తున్న దుకాణదారులు



మంటలు అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది



అగ్ని ప్రమాద ఘటనలో సూచనలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, పక్కన కమిషనర్ ధ్యానచంద్ర, ఆసిఫ్

అగ్నిప్రమాదంతో భయాందోళన

విద్యాధరపురంలోని లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కాశ్మీర్ జలకన్యల ఎగ్జిబిషన్‌లో బుధవారం సంభవించిన అగ్నిప్రమాదంతో స్థానికులు భయాందోళన చెందారు. గ్యాస్ సిలిండర్‌కు ఉన్న రెగ్యులేటర్ ఊడిపోవడంతో గ్యాస్ లీకయి మంటలు వ్యాపించి ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఫైర్ ఇంజిన్లతో అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు చర్యలు తీసుకున్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, తదితరులు ఘటన స్థలానికి చేరుకుని పనిశీలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గన్నవరం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖకు చెందిన వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఆర్టీవో కె. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం విజయవాడకు చెందిన ఆయుష్ హాస్పిటల్, సంధ్య నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో డ్రైవర్లకు గుండె, కంటి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాల్లో వల్లే జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లకు రహదారి భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండేందుకుగాను వైద్య శిబిరాలను నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు ఆరోగ్యం బాగుంటేనే వాహనాలను సక్రమంగా నడపగలుగుతారని చెప్పారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మూర్తి, వై. నాగేశ్వరరావు, శివరామ్‌గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ రమణ, ఎండీ. అలీ, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు వీఎంసీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సులను ఈ నెలఖరులోగా రెన్యువల్ చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ లోగా రెన్యువల్ చార్జీలు చెల్లించేవారికి ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. రెన్యువల్స్‌ను నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని వీఎంసీ క్యాష్ కౌంటర్లలో, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చన్నారు. రెన్యువల్స్ మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ లోగా చేసుకుంటే చార్జీల్లో 25శాతం, ఏప్రిల్ 1 నుంచి 30 తేదీలోగా రెన్యువల్స్ చేసుకుంటే రెన్యువల్ ఫీజులకు 50 శాతం అపరాధ రుసుంగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

విధులకు హాజరైన కొత్తపేట సీఐ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గత నాలుగు రోజులుగా అజ్ఞాతంలో ఉన్న కొత్తపేట సీఐ చిన కొండలరావు బుధవారం విధులకు హాజరయ్యారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాపురం పంచాయితీలో ఓ స్థల వివాదం నేపథ్యంలో సీఐ కొండలరావుపై ఓ ఎమ్మెల్యే నోటికి వచ్చినట్లు మాట్లాడినట్టు ప్రచారం జరిగింది. దీంతో గత శుక్రవారం రాత్రి స్టేషనన్ నుంచి ఇంటికి వెళ్లిన ఆయన పోలీసు ఉన్నతాధికారులెవరికీ అందుబాటులోకి రాలేదు. తన వ్యక్తిగత ఫోన్‌ను సైతం స్విచ్ ఆఫ్ చేసుకున్న కొండలరావు బుధవారం సాయంత్రం 5 స్టేషన్‌కు విచ్చేశారు. నేరుగా తన చాంబర్‌లోకి వెళ్లి, స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం కొత్తపేట పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.

రేపు స్కిల్ ఫెస్ట్-2025

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈనెల 14 తేదీ తమ స్కూల్ ఆవరణలో స్కిల్ ఫెస్ట్- 2025 పేరుతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి పలు ప్రాజెక్టు నమూనాలు, సైన్స్, సోషల్ అంశాలకు సంబంధించిన నమూనాలు, త్రీడి చిత్రాల నమూనాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్టులను ప్రదర్శిస్తారని వివరించారు.

ఆ కాఫీ షాపును తొలగించండి

విజయవాడస్పోర్ట్స్: స్థానిక నక్కలరోడ్డులోని ఆంధ్రా హార్ట్, బ్రెయిన్ ఆస్పత్రి వద్ద ఉన్న కాఫీ షాపు కారణంగా ఆ రోడ్డులో తరుచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధురానగర్‌కు చెందిన యు.రవితేజ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బిల్డింగ్ సెట్‌బ్యాక్‌ను ఆక్రమించి మునిసిపల్ బిల్డింగ్ రూల్స్‌కు వ్యతిరేకంగా కాఫీ షాపును ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. షాపునకు వచ్చే కస్టమర్స్ వారివారి వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతోందని, ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోందని, దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుని ప్రజాప్రయోజనాలను కాపాడాలని అధికారులను కోరారు.

దుర్గగుడికి కొత్త హుండీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో కొత్త హుండీలను ఏర్పాటు చేసేందుకు ఈవో రామచంద్రమోహన్ చర్యలు తీసుకుంటున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంతో పాటు ఆలయ ప్రాంగణంలోని దత్తత దేవాలయాల్లో ఇప్పటి వరకు రౌండ్ షేప్‌లో ఉన్న హుండీలను ఏర్పాటు చేశారు. అయితే ఆలయానికి భక్తుల తాకిడి పెరగడం, క్యూలైన్‌లో రౌండ్ హుండీలతో భక్తులు త్వరగా ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రౌండ్ హుండీల స్థానంలో బాక్స్ టైప్ హుండీలను ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తొలగుతాయని బావించి తొలి దశలో నాలుగు హుండీలను తయారు చేయించారు.

ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈనెల 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో రాష్ట్ర 22వ మహాసభలు జరిగాయి. మహాసభల తీర్మానాలను, నూతన కార్యవర్గ వివరాలను బుధవారం విజయవాడ సీపీఐ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం. యుగంధర్ (శ్రీకాకుళం), రాష్ట్ర కార్యదర్శిగా పరుచూరి రాజేంద్రబాబు (ఎన్టీఆర్ జిల్లా), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. సంతోష్ కుమార్ (అనంతపురం), ఉపాధ్యక్షులుగా వై బాబీ (కాకినాడ), కె. శ్రీనివాసులు (కర్నూలు), సీహెచ్ గీత (కాకినాడ), పి. ప్రభాకర్, (ప్రకాశం), సహాయ కార్యదర్శులుగా షేక్ సుభాని (పల్నాడు), జి. నాగరాముడు (నంద్యాల), కత్తి రవి (తిరుపతి), కోశాధికారిగా వై. రాంబాబు (విశాఖపట్నం) ఎన్నికయ్యారని పరుచూరి రాజేంద్ర తెలిపారు.

కనులపండువగా శ్రీవారి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో స్వామివారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేంకటేశ్వరస్వామి వారి చక్రతీర్థ స్నానం పవిత్ర కృష్ణానదిలో బుధవారం ఉదయం అత్యంత నేత్రపర్వంగా జరిగింది. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారికి వసంతోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో రంగులు పూసుకుంటూ శ్రీహరి నామస్మరణ మధ్య శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో కృష్ణానది ఒడ్డున దుర్గాఘాట్‌కు తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారి చక్రతీర్థ స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు కృష్ణానదిలో స్నానమాచారించి జైశ్రీమన్నారాయణ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆగమ పండితులు ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను కృష్ణానదికి తీసుకెళ్లారు. అక్కడ నది ఒడ్డున స్వామి వారి తెప్పోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. పర్యాటక శాఖకు చెందిన విజయసిరి వాహనంపై రమణీయంగా పూల, విద్యుత్ అలంకరణ గావించారు. అనంతరం ఆలయం నుంచి మేళతాళాలతో తీసుకెళ్లిన ఉత్సవమూర్తులను ప్రత్యేక ఆసనంపై ఆధిష్టింపజేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఒకవైపు మేళతాళాలు, మరోవైపు భజన బృందాల భజనలు, పండితుల వేదనాదాల మధ్య మూడు సార్లు కృష్ణానదిలో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు

ఘనంగా అశ్వవాహన సేవ

ఆలయ ప్రాంగణంలో అశ్వవాహనంపై ఊరేగిన స్వామివారికి తిరుమంగై ఆళ్వార్ చోర సంవాదం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. చోరసంవాద కార్యక్రమాలను అర్చకస్వాములు చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. వైధిక కార్యక్రమాలను పీ.శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

15 కల్లా పొదుపు సంఘాల ప్రొఫైలింగ్ పూర్తి చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



సచివాలయంలో స్వయం సహాయక బృందాల వివరాల నమోదును పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పొదుపు సంఘాల వివరాల నమోదును ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెజ్జోనిపేట, పూర్ణానందం పేట, హార్ట్ పేట, పప్పులమిల్లు ప్రాంతంలోని సచివాలయాలను సందర్శించి ఆర్పీలు చేస్తున్న ఆన్‌లైన్ ఎస్.హెచ్.జి ప్రొఫైలింగ్‌ను పరిశీలించారు. అనంతరం గులాబీ తోటలోని అన్న క్యాంటీన్‌లో వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల సభ్యుల వివరాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పెజ్జోనిపేటకు చెందిన మురళీకృష్ణ నివాసంలో సూర్య ఘర్ పథకంలో భాగంగా ఇన్‌స్టాల్ చేసిన సోలార్ ప్యానల్స్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో కిచెన్‌లో పరిశుభ్రత, ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకట నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ సైకాలజీ బోర్డు సభ్యునిగా ప్రసాద్ బాబు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైకాలజీ పీజీ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా ప్రముఖ మనస్తత్వ శాస్త్రవేత్త, ఇగ్నో డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు ఉత్తర్వులు జారీ చేశారు. సైకాలజీ బోర్డు సభ్యుడిగా ప్రసాద్ బాబు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. సైకాలజీ పీజీ కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన, పరీక్షల నిర్వహణ, ఇతర విధి విధానాలు, యూనివర్సిటీలో సైకాలజీ విభాగాన్ని పటిష్ట పరచటం, సదస్సుల నిర్వహణ మొదలైన అంశాలు బిఓఎస్ సూచనలకు అనుగుణంగా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. సైకాలజీ విభాగంలో ప్రసాద్‌బాబుకు ఉన్న విశేష అనుభవాన్ని పురస్కరించుకొని ఆయనను ఈ పదవిలో నియమించారు. మనోవికాస మార్గదర్శకత్వం, మనస్తత్వ విశ్లేషణ రంగాలలో ప్రముఖుడుగా పేరుపొందిన ప్రసాద్ బాబు సైకాలజీపై 60కి పైగా పుస్తకాలు రచించారు. ఉమ్మడి తెలుగు అకాడమీకి 25కు పైగా పుస్తకాలు సైకాలజీ గురించిన వివిధ అంశాలపై రచించారు. తెలుగు అకాడమీ ప్రచురించిన డీఎస్సీ, టెట్ తదితర పోటీ పరీక్షలకు ఆయన రాసిన పుస్తకాలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఇగ్నో, బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తదితర అనేక విశ్వవిద్యాలయాలకు ప్రసాద్ బాబు పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ రచించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ప్రచురిస్తున్న కామన్ కోర్ బీఈడీ పాఠ్యపుస్తకాలకు సంపాదక మండలి సభ్యుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి



అధికారులను సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కొత్తవంతెన జంక్షన్, సాంబమూర్తి రోడ్డు, అజిత్ సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో ఎటువంటి లోపం తలెత్తకూడదన్నారు. సేకరించిన వ్యర్థాలను క్రమం తప్పకుండా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ద్వారా నిర్వహణ జరగాలని ఎప్పారు. వ్యర్థాల నుండి ఎరువులు తయారు చేసే ప్రక్రియ, పూల వ్యర్థాల నుండి అగరవత్తులు చేసే ప్రక్రియ, కొబ్బరి బొండాల వ్యర్థాల నుండి కొబ్బరి పీచు దాని ఉత్పత్తుల తయారీ ప్రక్రియ నిత్యం జరగాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ సిటీ ప్లానెటర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలతో సామాజిక మార్పు

ఆధ్యాత్మిక వేత్త మల్లాది వెంకట రామనాథ శర్మ

విజయవాడ కల్చరల్: పంచమవేదం మహాభారతమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మల్లాది వెంకట రామనాథ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో మహాభారతంలోని పలు ఘట్టాలను వివరించారు ఆయన మాట్లాడుతూ మహాభారతం భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంతో ధ్రువతారగా నిలిచి పోయిందన్నారు. పురాణాల ప్రవచనాల వల్ల సమాజంలో అనేక మార్పులు కలుగుతాయని చెప్పారు. అనాదిగా గ్రామాలలో పురాణాల ప్రవచనాలు మహావైభవంగా జరిగేవన్నారు. నేడు ప్రసార మాధ్యమాల వల్ల విస్తృత మయ్యాయని చెప్పారు. ఉదయం దేవాలయ సముదాయంలో చండీ పారాయణం, నవ చండీ హోమం, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్ఆర్ఆర్‌లో తెలుగు పరిచయం కోర్సు ప్రారంభం

మధురానగర్: మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు పరిచయం కోర్సు ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 48 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. ఆడిట్ ఆఫీసర్ ఆర్. సుజాత, తదితరులున్నారు.